ప్రజాశక్తి
శుక్రవారం 16 మే 2025
5
అల్లూరి సీతారామరాజు



భారత్ గౌరవ్ టూరిస్ట్ రైలు యాత్ర

ప్రజాశక్తి-పాడేరు: ఇండియన్ రైల్వే కేటరింగ్, టూరిజం(ఐఆర్‌సిటిసి) ఆధ్వర్యంలో 'భారత్ గౌరవ్ ట్రైన్ యాత్ర' పేరిట వేసవికి ప్రత్యక టూరిస్ట్ రైల్ టూర్ ప్యాకేజీలను అమలు చేస్తోందని, వాటిని ప్రజలు వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ గురువారం ప్రకటనలో తెలిపారు. ఈ ప్యాకేజీల ద్వారా దేశంలోని ప్రధాన పర్యాటక ప్రాంతాలను చూడొచ్చన్నారు. హైదరబాద్ నుంచి బయలుదేరే ఈ ప్రత్యేక టూరిస్ట్ రైలుయాత్రలో రైలు ప్రయాణంతోపాటు, అవసరమైన చోట్ల బస్ ప్రయాణం, వసతి, ఆహారం, గైడ్ సేవలు అన్నీ సమకూరుస్తారని, ప్రయాణికులకు బీమా సౌకర్యం ఉంటుందన్నారు. టూర్ ప్యాకేజి వివరాలు, యాత్ర ప్రారంభ తేదీలు, యాత్రా ప్రదేశాల వివరాలకు సంబంధిత వెబ్‌సైట్‌తో పాటు 040-27702407, 9701360701 ఫోను నెంబర్లను సంప్రదించ వచ్చన్నారు.

ఆదివాసీ ప్రత్యేక డిఎస్‌సి ప్రకటించాల్సిందే!

- నేడు పాడేరులో సాధన కమిటీ రాష్ట్ర సదస్సు
- రంపచోడవరం, చింతూరులో ఆదివాసీ జెఏసి రిలే దీక్షలు


ప్లకార్డులను ప్రదర్శిస్తున్న గిరిజన ప్రత్యేక డిఎస్‌సి సాధన కమిటీ నేతలు

ప్రజాశక్తి- అరకులోయ: రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన మెగా డిఎస్‌సిలో ఆదివాసీ ప్రాంతం ఐటిడిఎ పరిధిలో నోటిపై చేసిన ఉపాధ్యాయ పోస్టులు మినహాయింపు ఇచ్చి ఆదివాసీ ప్రత్యేక డిఎస్‌సి నోటిఫికేషన్ ద్వారా భర్తీ చేయాలని అరకు జోన్ ఏజెన్సీ స్పెషల్ డీఎస్సీ సాధన కమిటీ డిమాండ్ చేసింది. ఏజెన్సీ స్పెషల్ డిఎస్‌సి సాధన కమిటీ కన్వీనర్ ఎం రమేష్ కుమార్, కోకన్వీనర్లు కొర్రా శ్యామ్, కిల్లో దాసు, అడకట్ల అభి, గుజ్జెల సురేష్ మాట్లాడుతూ, ఏజెన్సీ స్పెషల్ డిఎస్‌సి సాధన కమిటీ అధ్యర్యంలో పోరాటం ఫలితంగా రాష్ట్ర ముఖ్యమంత్రి స్పందించి రాష్ట్ర ప్రభ్యత్వ వైఖరిని వెల్లడించిందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటనతో మరింతగా స్పష్టతతో ఆదివాసీ సమాజం పోరాటంలోకి రావాలన్నారు. మెగా డిఎస్సీ ద్వారా ఆదివాసులకు 100 శాతం రిజర్వేషన్ అమలుకు ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయలేదని, మెగా డిఎస్‌సితో పాటు, ఏజెన్సీ స్పెషల్ డిఎస్‌సి నిర్వహిం చాలని, లేదా మెగా డిఎస్‌సి నుండి ఏజెన్సీ ప్రాంత టీచర్స్ పోస్ట్‌లు భర్తీ చేయకుండా మినహాయించి తరువాత ఏజెన్సీ స్పెషల్ డిఎస్‌సి ద్వారా స్థానిక ఆదివాసీలతో టీచర్స్ పోస్ట్‌లు భర్తీ చేయాలని ఏజెన్సీ స్పెషల్ డిఎస్సీ సాధన కమిటీ డిమాండ్ చేసింది.ఆదివాసీ ప్రత్యేక డిఎస్‌సిపై రాష్ట్ర ప్రభుత్వం స్పష్టమైన ఉత్తర్వులు ఇవ్వకుండా మెగా డిఎస్‌సి నిర్వహించడం వల్ల ఏజెన్సీ ప్రాంత ఆదివాసీ యువతకు, ఉద్యోగులకు తీవ్ర అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై ప్రభుత్వానికి తమ వైఖరిని తెలిపేందుకు ఏజెన్సీ స్పెషల్ డిఎస్‌సి సాధన కమిటీ అధ్యర్యంలో అన్ని గిరిజన, ఉద్యోగ, ఉపాధ్యాయ, విద్యార్థి, మహిళా సంఘాలతో పాటు డిఎస్‌సి అభ్యర్ధులతో ఈనెల 16న పాడేరులో నిర్వహించే సమావేశంలో పాల్గొని విజయవతం చేయాలని, భవిష్యత్ పోరాట కార్యాచరణకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.

గిరిజనులకు వంద శాతం ఉద్యోగాల చట్టబద్ధతపై

20న రాష్ట్ర కేబినెట్‌లో తీర్మానించాలి

అనంతగిరి : ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్నికల మేనిఫెస్టోలో హామీ ప్రకారం ఏజెన్సీ ప్రాంతాల్లో వంద శాతం ఉద్యోగ ఉపాధ్యాయ నియామక చట్టం కోసం ఆర్డినెన్సు జారీకి ఈనెల 20న రాష్ట్ర కేబినెట్ సమావేశంలో తీర్మానం చేయాలని, మెగా డిఎస్‌సి నుండి ఏజెన్సీ పోస్టులు మినహాయింపు చేయాలని అనంతగిరి జెడ్‌పిటిసి, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు దీసరి.గంగరాజు డిమాండ్ చేశారు. గురువారం విలేకరులతో మాట్లాడుతూ, ముఖ్యమంత్రి చంద్రబాబు గిరిజన సంక్షేమ శాఖ సమీక్షలో మూడు అప్షన్లు పరిశీలిస్తున్నట్లు వార్తల్లో వచ్చిందని, అయితే గిరిజన ప్రాంతాల్లో,ఆదివాసులకు న్యాయం జరగాలంటే ప్రత్యేక జిఓతోనే ఏజెన్సీ ప్రాంతంలో వందశాతం రిజర్వేషన్లు కల్పిస్తేనే న్యాయం జరుగుతుందని, మిగతా ఆప్షన్లు అమలు చేస్తే ఆదివాసులకు తీవ్ర అన్యాయం జరుగుతుందని స్పష్టం చేశారు. డిఎస్‌సి దరఖాస్తు గడువు 15తో ముగిసినందున దీనిపై ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకుని ప్రకటేన చేయాలని డిమాండ్ చేశారు. బందులు, ధర్నాలతో ఆదివాసీ నిరుద్యోగుల ఆందోళనను గుర్తించాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం సర్పంచ్ కె. మోస్య, పార్టీ మండల కార్యదర్శి పూజారి.లక్ష్మణరావు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సిపిఎం జెడ్‌పిటిసి గంగరాజు

ఆదివాసీ జెఏసి ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలు


రంపచోడవరంలో దీక్షలు చేస్తున్న ఆదివాసీ జెఏసి నేతలు

రంపచోడవరం : ఐటిడిఎ ఎదురుగా గురువారం (టిఎసి) ట్రైబల్ అడ్వైజరీ కౌన్సిల్ ఏర్పాటుకు తీర్మానం చేసి షెడ్యూల్ ప్రాంత ఉద్యోగాల నియామకాల చట్టం చేయాలని ఆదివాసి జేఏసీ రాష్ట్ర కోర్ కమిటీ సభ్యులు కంగల శ్రీనివాసు ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలు ప్రారంభించారు. ఆదివాసీ అడ్వకేట్ ఆత్రం నవీన్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా కంగల శ్రీనివాసు మాట్లాడుతూ ఆదివాసీ ప్రత్యేక డిఎస్‌సి నోటిఫికేషన్ విడుదల చేయాలని,ట్రైబల్ అడ్వైజరీ కౌన్సిల్ ఏర్పాటు చేయాలని జిఒ నెంబర్ 3 చట్టబద్ధత కల్పిస్తామని ఎన్నికల ముందు అరకులో ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన హామీని అమలు చేయాలని, ఎన్‌సి ఎస్‌టి బ్యాక్ లాగ్ పోస్టులను భర్తీ చేయాలని, ట్రైకార్ రుణాలు నిరుద్యోగ యువతకు మంజూరు చేయాలని, ఆదివాసీ హక్కులు, చట్టాలను పకడ్బందీగా అమలుచేయాలని మొదలైన సమస్యల పరిష్కారానికి సిఎం ఆదివాసీలకు స్పష్టమైన హామీ ఇచ్చేంత వరకు రిలే నిరాహార దీక్షలు కొనసాగిస్తామన్నారు.ఈ సందర్భంగా రెండు రోజుల కిందట ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదివాసీలకు వందశాతం ఉద్యోగాలను ఇవ్వడానికి కట్టుబడి ఉన్నాము అని ప్రకటించడంపై ఆంధ్రప్రదేశ్ ఆదివాసీ జేఏసీ,రంపచోడవరం డివిజన్ తరుపున ధన్యవాదాలు తెలిపారు నిరాహార దీక్షలకు పోడియం పండు దొర, చవలం శభకృష్ణ, నాయకులు పాల్గొన్నారు.

చింతూరు: ఐటిడిఎ వద్ద ఆంధ్రప్రదేశ్ ఆదివాసి జెఎసి, చింతూరు డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో గురువారం ఆదివాసి జెఏసి రాష్ట్ర సహాయ కార్యదర్శి కుంజా అనిల్ చింతూరు డివిజన్ చైర్మన్ జల్లి నరేష్ ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలు ప్రారంభ మయ్యాయి. డిమాండ్లు సాధించేవరకూ దీక్షలు కొనసాగిస్తా మన్నారు. కార్యక్రమాన్ని ఎపిఏజెఏసి సెంట్రల్ కమిటీ నాయకులు మడివి నెహ్రూ, ఎయుఎస్ పి.రాష్ట్ర నాయకులు పూసం శ్రీను, ఎపిఎంహెచ్ఇఎ రాష్ట్ర అధ్యక్షులు తుష్టి జోగారావ్, ఎపిఎయు జెఏసి జిల్లా నాయకులు సోడి నారాయణ, ఎఐఎఇఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు కాక రాజు ప్రారంభించగా కుంజా అనిల్, జల్లి నరేష్, వేటగాని మల్లయ్య తదితరులు పాల్గొన్నారు


చింతూరు ఐటిడిఎ వద్ద దీక్షా శిబిరంలో నినాదాలు చేస్తున్న జెఏసి నేతలు


మద్దిగరువులో కురుస్తున్న వర్షం

మన్యంలో కుండపోత వర్షం

ప్రజాశక్తి-సీలేరు : జికెవీధి మండలం సీలేరులో గురువారం సాయంత్రం కుండపోత వర్షం కురవడంతో డ్రైనేజీలు పొంగి ప్రవహించాయి. ఉదయం నుంచి ఉష్ణోగ్రత ఉక్క పోత అధికంగా ఉండడంతో ప్రజలు ఇబ్బందులు గురయ్యారు. సాయంత్రం పెద్ద పెద్ద ఉరుములు మెరుపులు ఈదురుగాలులతో సుమారు 20 నిమిషాల పాటు కుండపోత వర్షం కురవడంతో రహదారులు జలమయమ య్యాయి. లోతట్టు ప్రాంతాల్లో ఉన్న ఇళ్లలోకి వర్షపునీరు రావడంతో ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు. ఎపి జెన్‌కో కాలని నుంచి వచ్చిన వర్షపు నీరుతో డ్రైనేజీలు పొంగి ప్రవహించాయి. సీలేరు పరిసర ప్రాంతాల్లో వర్షం భారీగా కురవడంతో గిరి రైతులకు ఎనలేని ఉత్సాహం నెలకొంది. తొలకరి దుక్కులకు వర్షాలు ఎంతో దోహదపడతాయని అయితే మామిడి, జీడి మామిడి పంటలకు అపార నష్టం కలిగిందని ఆందోళన వ్యక్తం చేశారు.

రాజవొమ్మంగి : రాజవొమ్మంగి మండలంలో గురువారం మధ్యాహ్నం వర్ష బీభత్సం సృష్టించింది.మధ్యాహ్నం మూడు గంటల వరకు ఎండ తీవ్రత ఎక్కువగా ఉంది. ఆకస్మికంగా ఆకాశం మేఘా వృతమై ఈదురు గాలులు, ఉరుములు,మెరుపులు, పిడుగులతో కుండపోత వర్షం కురిసింది. జడ్డంగి, దూసరపాము,తదితర ప్రాంతాల రోడ్లన్నీ జలమయమయ్యాయి. రంపచోడవరం ఏజన్సీలో పలుచోట్ల చెట్టుకొమ్మలు విరిగి విద్యుత్ లైన్లపై పడటంతో గంటల తరబడి విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది.

వర్షంతో వారపుసంత వెలవెల

జి.మాడుగుల :మండల కేంద్రంతో పాటు బొయితిలి పంచాయతీ మద్ది గరువు గ్రామంలో గురువారం ఉరుములు మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. దీంతో మద్దిగరువు వారపు సంతకు వచ్చే గిరిజనులు, వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. నిత్యావసర వస్తువులు కొనుగోలుకు సంతకు వచ్చిన గిరిజనులు వర్షం తాకిడికి ఏమీ కొనుక్కోలేక నిరాశతో వెనుతిరిగారు. అక్కడక్కడ పిడుగులు పడడంతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు.


రాజవొమ్మంగిలో కురుస్తున్న భారీ వర్షం


ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న ప్రాజెక్ట్ అధికారి

నాటుసారా నిర్మూలనకు కృషి

ప్రజాశక్తి-మారేడుమిల్లి : ఏజెన్సీలో నాటుసారా నిర్మూలించే బాధ్యత సంబంధిత అధికారులపై ఉందని రంపచోడవరం ఐటిడిఎ పిఒ కట్ట సింహాచలం పేర్కొన్నారు. గురువారం మారేడుమిల్లి గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని, మండల పరిషత్ కార్యాలయాన్ని ఎపిఆర్ బాలుర ఆశ్రమ పాఠశాలను ప్రాజెక్ట్ అధికారి ఆకస్మికంగా పర్యటించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏజెన్సీలో నాటు సారా వలన అనేకమంది అనారోగ్యంతో బాధపడుతూ కొంతమంది చనిపోతున్నారన్నారు. ఏజెన్సీలోని ఏడు మండలాల పరిధిలో నాటు సారా తయారుచేసినా, తరలించినా, విక్రయించినా చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతిగ్రామంలో అవగాహన కల్పించాలని సంబంధిత అధికారులకు ప్రాజెక్ట్ అధికారి ఆదేశించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో సీజనల్ వ్యాధులకు సంబంధించిన మందులు ఎప్పటికప్పుడు అందుబాటులో ఉంచాలన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఒపి పేషెంట్లు ఎంతమంది ఉన్నారు, ఎంతమంది గర్భిణులు, బాలింతలు ఉన్నారనేది ఆరాతీశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వచ్చిన రోగులకు వెంటనే చికిత్స అందజేయాలన్నారు. అనంతరం ఎపిఆర్ బాలుర ఆశ్రమం పాఠశాలలో పదోతరగతి ఫెయిల్ అయిన విద్యార్థులకు ఈ నెల నుండి నిర్వహించే సప్లిమెంటరీ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ప్రత్యేక క్లాసులు నిర్వహించే కేంద్రాన్ని పరిశీలించారు. తహశీల్దార్ బాలాజీ, ఎంపిడిఒ శ్రీనివాస్ విశ్వనాథ్, వైద్యాధికారి హరికృష్ణ పాల్గొన్నారు.

జాతరలో నాటుసారా విక్రయిస్తే కఠినచర్యలు

గ్రామదేవత గంగమ్మజాతరను పురస్కరించుకుని మండలంలో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పంచాయతీరాజ్, రెవెన్యూ అధికారులు చర్యలు చేపట్టారు. నాటుసారా తయారుచేసినా, విక్రయించినా కఠినచర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఎంపిడిఒ తూతిక శ్రీనివాస విశ్వనాథ్, తహశీల్దార్ బాలాజీ కొన్ని ప్రాంతాలను తనిఖీ చేశారు. హోటళ్లు అన్నిటిని తనిఖీ చేయనున్నామని తెలిపారు. మండలంలో నాటుసారా తయారీ కేంద్రాలు ఉన్నట్టు సమాచారం అందిందని చర్యలు తీసుకుంటామని ఎంపిడిఒ తెలిపారు.



గృహనిర్మాణ సామగ్రిని అందిస్తున్న జమాల్‌ఖాన్

గృహ నిర్మాణ సామగ్రి వితరణ

ప్రజాశక్తి-చింతూరు: మండల కేంద్రంలోని ఎస్‌టి కాలనికి చెందిన కరక సత్యవతి ఇల్లు గతంలో కురిసిన వర్షాలకు కూలిపోయింది. వ్యవసాయ కూలి పనులు చేసుకుంటూ కుటుంబం నెట్టుకొస్తున్న ఆవిడ ఆర్థిక పరిస్థితి దయనీయంగా ఉండ డంతో స్థానిక మనము ఆయుర్వేద వైద్యులు ట్రస్ట్ చైర్మన్ జమాల్‌ఖాన్‌ను సంప్రదించి తన పరిస్థితిని ఆయనకు వివరించింది. జమాల్‌ఖాన్ సత్యవతి ఇంటికి వెళ్లి పరిస్థితిని తెలుసుకుని అనంతరం గురువారం తన ట్రస్ట్ వాహనం ద్వారా ఇంటి నిర్మాణానికి సరిపడా సిమెంట్ రేకులు ఇనుప పైపులను అందజేశారు. జెకెసిటి ట్రస్ట్ సభ్యులు రమణయ్య, బాబు, గఫూర్ పాల్గొన్నారు.

డెంగీపై అవగాహన కల్పించండి


మాట్లాడుతున్న ఎంఒ సత్యనారాయణ

ప్రజాశక్తి అరకులోయ రూరల్: దేశంలో డెంగీ కేసులు అత్యధికంగా నమోదవుతున్న నేపథ్యంలో ఈనెల 16న జాతీయ డెంగీ దినోత్సవం సందర్భంగా ఈ వ్యాధిపై ప్రజల్లో అవగాహన కల్పించాలని అల్లూరి జిల్లా ఎఎంఒ సత్యనారాయణ అన్నారు గురువారం అరకులోయ మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ లవరాజు, ఇఒపిఆర్‌డి రాజకుమార్ ఆధ్వర్యంలో 14 పంచాయతీల కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఎంఒ మాట్లాడుతూ, డెంగీ ప్రాణాపాయంతో కూడుకున్న వెక్టర్ వల్ల సంక్రమించే వ్యాధి అన్నారు.ఈ వైరస్ వెస్ట్‌నైల్ ఇన్ఫెక్షన్ పసుపు జ్వరానికి సంబంధించినదని, ఎడిస్ దోమ కుట్టడం ద్వారా డెంగీ వస్తుందన్నారు. .తీవ్రమైన తలనొప్పి కీళ్లనొప్పి, కండరాల నొప్పి వికారం తొందరగా అలసిపోవడం జ్వరం వాంతులు ఐదు రోజుల తర్వాత చర్మంపై దద్దుర్లు తేలికపాటి రక్తస్రావం డెంగీ వ్యాధి అత్యంత సాధారణ లక్షణాలన్నారు.
ఇంటి పరిసరాల పరిశుభ్రత, నీరు నిల్వ లేకుండా చూడడం, ప్రతిశుక్రవారం డ్రైడే పాటించడం వంటి వాటిపై ప్రజలకు అవగాహన కల్పించి, వాటిని పాటించడం ద్వారా దోమలను అరికట్టి, డెంగీని నివారించవచ్చని ప్రజలను చైతన్యపరచాలన్నారు.

చిమ్మ చీకట్లో గిరిజన గ్రామాలు

- రెండురోజులుగా నిలిచిన విద్యుత్ సరఫరా
- గాలీవాన బీభత్సంతో పాడైన ట్రాన్స్‌ఫార్మర్లు


అంధకారంలో రాజుపాక గ్రామాలు

ప్రజాశక్తి-అనంతగిరి : మండల కేంద్రం అనంతగిరిలో రెండు రోజులుగా విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురివుతున్నారు. మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో పది పంచాయతీ గ్రామాల ప్రజలు చీకటిలో మగ్గుతున్నారు. రెండు రోజులుగా పిడుగులు వాన బీభత్సంతో ఆయా గ్రామాల్లోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు పనిచేయకపోవడంతో విద్యుత్‌కు అంతరాయం ఏర్పడింది. రెండురోజులుగా సెల్‌ఫోన్లు ఛార్జింగ్ పెట్టుకోవడానికి కూడా వీలు లేని పరిస్థితుల్లో సమాచారాన్ని సైతం ఇతరులుకు చెప్పుకునే పరిస్థితి లేదని స్థానికులు వాపోతున్నారు. విద్యుత్ సిబ్బంది రెండు రోజులుగా మరమ్మతు పనులు చేపట్టి, శ్రమిస్తున్నప్పటికీ సరఫరా పునరుద్ధరణ జరగడం లేదు. సంబంధిత అధికారులు స్పందించి తగు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

సమ్మె జయప్రదానికి విస్తృత ప్రచారం

ప్రజాశక్తి-చింతపల్లి : కార్మిక చట్టాలను రద్దు చేసి, వారి హక్కులను కాలరాసే కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా జులై 9న జరిగే జాతీయ సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు అల్లూరి జిల్లా అధ్యక్షుడు బోనంగి చిన్నయ్యపడాల్ పిలుపునిచ్చారు.. గురువారం మండలంలోని ఆచార్య ఎన్‌జి.రంగా వ్యవసాయ పరిశోధన కేంద్రం పరిధిలోని కార్మికులు, ఆసుపత్రుల పారిశుధ్య, సెక్యూరిటీ సిబ్బందికి సిఐటియు ఆధ్వర్యంలో కరపత్రాలు పంపిణీ చేశారు. నాలుగు లేబర్ కోడ్‌ల వల్ల కార్మికులకు కలిగే నష్టాలను వివరిస్తూ, వాటి రద్దుకు కేంద్రంపై పోరాడాలని పిలుపునిచ్చారు. దశాబ్దాలుగా కార్మికులు పోరాడి సాధించుకున్న హక్కులను మోదీ ప్రభుత్వం ఒక్క చర్చ లేకుండానే పార్లమెంటులో రద్దు చేసిందని, ఉద్యోగ భద్రత, కనీస వేతనాలు, పిఎఫ్, ఈఎస్ఐ వంటి హక్కులను కొట్టివేయడమే కాక, సమ్మె చేయాలన్న హక్కును కాలరాసి, కార్మికుల్ని కట్టు బానిసలను చేయాలని కుట్ర చేస్తోందన్నారు. కార్యక్రమంలో ఎస్.కె. రహిమాన్, అర్జున్, పార్వతమ్మ, సతీష్, రాము పాల్గొన్నారు.


బుక్‌లెట్ ఆవిష్కరిస్తున్న సిఐటియు జిల్లా అధ్యక్షుడు చిన్నయ్యపడాల్

ప్రీస్కూల్ విద్యపై తల్లిదండ్రులకు అవగాహన


సంసిద్ధత ఉత్సవ్ కార్యక్రమం నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు


ప్రజాశక్తి, విఆర్ పురం: కూనవరం ప్రాజెక్ట్ విఆర్ పురం సెక్టార్ పరిధిలోని రాజుపేట కాలనీలో మెగా పాఠశాల సంసిద్ధత ఉత్సవ్ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమాన్ని రాజపేట పంచాయతీ సర్పంచ్ శారద, జెడ్పిటిసి వాళ్ళ రంగారెడ్డి, కూనవరం ప్రాజెక్టు అధికారి నాగలక్ష్మి, ఉపసర్పంచ్ రాము, సూపర్‌వైజర్ నయోమి రాణి, ఐటిసి ప్రథమ్ జిల్లా కోఆర్డినేటర్ పవన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన స్టాల్స్‌ను పరిశీలించి పిల్లల యొక్క ప్రగతిని తెలుసుకున్నారు. కార్యక్రమం ఏర్పాటు చేసిన ఐటిసి సంస్థ వారికి ఐసిడిఎస్‌కు ధన్యవాదాలు తెలిపారు.పాల్గొన్న పిల్లలకు, వారి తల్లులకు పిల్లల అభివృద్ధి పత్రాలను అందజేశారు. ఈ మేళాని ఒక పండుగలాగా చేయడం చాలా బాగుందన్నారు. అనంతరం అందరూ కలసి గ్రామంలో మెగా సంసిద్ధత ఉత్సవంపై ర్యాలీ నిర్వహించారు. సచివాలయ సిబ్బంది జిఎంఎస్‌కె, పాఠశాల చైర్మన్ నాగేంద్ర, గ్రామపెద్దలు, తల్లిదండ్రులు, ఆశ కార్యకర్తలు,సెక్టార్‌లో అంగన్‌వాడీ కార్యకర్త రాజేశ్వరి కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యుత్ బిల్లుల్లో గందరగోళం

ప్రజాశక్తి -సీలేరు: జికె వీధి మండలం సీలేరు మేజర్ పంచాయతీ పరిధిలో విద్యుత్ వినియోగదారులకు ట్రాన్స్‌కో సిబ్బంది పూర్తిస్థాయిలో రీడింగ్ తీసి బిల్లులు అందజేయకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. ప్రతినెలా మీటర్ రీడింగ్ తీసి ట్రాన్స్‌కో సిబ్బంది బిల్లులు అందజేయవలసి ఉంది. ఈ నెలలో కొంతమంది వినియోగదారులకు మాత్రమే రీడింగ్ తీసి బిల్లులు ఇచ్చారు. మరి కొంతమందికి రీడింగ్ తీయకుండా వెళ్లిపోయారని వాపోయారు. నెలనెలా ఇవ్వకుండా రెండు నెలలకు కలిపి ఇస్తే ఎలా చెల్లిస్తామని వినియోగదారులు మండిపడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

అంతర్రాష్ట్ర రహదారి నిర్మాణానికి వినతి

ప్రజాశక్తి -సీలేరు: ఆర్‌వినగర్ నుంచి పాలగెడ్డ వరకూ అంతర్రాష్ట్ర రహదారి నిర్మాణానికి చర్యలు చేపట్టాలని ఎంపి తనూజరానికి వినతి పత్రం అందజేశామని సీలేరు సర్పంచ్ పాంగి దుర్జో వెల్లడించారు. ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ జికె వీధి మండలం అల్లూరి సీతారామరాజు జిల్లా ఆర్‌వినగర్ నుంచి పాలగెడ్డ వరకు అంతర్రాష్ట్ర రహదారి అధ్వానంగా తయారైందన్నారు. ఈ మార్గంలో వెళ్లాలంటే చాలా అవస్థలు పడుతున్నా మన్నారు. 12 సంవత్సరాల నుంచి ఇదే పరిస్థితి ఉన్నా ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. రహదారి పనులు వెంటనే ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకోవాలని ఎంపి తనుజరాణి దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ కారే శ్రీనివాస్ చింతపల్లి క్యాంపు గ్రామస్తుడు కొర్ర జగ్గారావు తదితరులు పాల్గొన్నారు.


ఎంపీ తనూజారాణికి వినతిపత్రం అందజేస్తున్న సర్పంచ్ దుర్జో



'సంఘం శరణం గచ్ఛామి' నాటకంలో ఓ సన్నివేశం

దృశ్య కావ్యంలా 'సంఘం శరణం గచ్ఛామి'

ఆకట్టుకున్న అంబేద్కర్ జీవిత సన్నివేశాలతో నాటక ప్రదర్శన

ప్రజాశక్తి- నర్సీపట్నం టౌన్ : కెవిపిఎస్ ఆధ్వర్యంలో అభ్యుదయ ఆర్ట్స్ ఆకాడమీ కళాకారులతో నర్సీపట్నం సిటీ క్లబ్‌లో బుధవారం రాత్రి ప్రదర్శించిన 'సంఘం శరణం గచ్ఛామి' నాటకం ఆకట్టుకుంది. కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఈరెల్లి చిరంజీవి అధ్యక్షతన నాటకం ప్రారంభానికి ముందుగా అంబేద్కర్ చిత్రపటానికి నర్సీపట్నం ఎంఇఒ సిహెచ్ తలుపులు, టి.విజయకుమార్ ,సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.కోటేశ్వరరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అభ్యుదయ నాటక బృందం ఆంధ్రా, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాలలో తెలుగు, హిందీ, ఇంగ్లీషు భాషలలో ఈ నాటకాన్ని ఇప్పటివరకు 800 ప్రదర్శనలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఎంఇఒ తలుపులు మాట్లాడుతూ అంబేద్కర్ జీవితం నేటితరానికి ఆదర్శనీయమని, ఆయన అందించిన సేవలు మరువలేనివన్నారు నాటకంలో అన్ని సన్నివేశాలు వాస్తవికతను ప్రతిబింబించేలా ఉండడంతో ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకున్నాయన్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో దృశ్య కావ్యంలా సాగిన నాటక ప్రదర్శనలో పలు దృశ్యాలకు ప్రేక్షకులు కన్నీటిపర్యంతం అయ్యారు. అంబేద్కర్ బాల్యం, విద్యాభ్యాసం, వివాహం, నిమ్నజాతుల హక్కుల కోసం చేసిన పోరాటాలు, రాజ్యాంగ రచనతో పాటు దేశ సేవలను ఈ నాటకంలో ప్రదర్శించారు. నాటకంలో చేసిన కళారూపాలు ప్రజలను ఆకట్టుకున్నాయి.కార్యక్రమంలో జనవ విజ్ఞానవేదిక రాష్ట్ర నాయకులు కె. త్రిమూర్తులు రెడ్డి, యుటిఎఫ్ సీనియర్ నాయకలు ఎం చిట్టియ్య, ప్రభుదాస్, విశ్రాంత ఆచ్యారులు యలమంద కోటేశ్వరరావు, విజయకుమార్ పాల్గొన్నారు.

17న పెదబయలు మండల సమావేశం

ప్రజాశక్తి-పెదబయలు : పెదబయలు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈనెల 17న ఎంపిపి బోండా వరహాలమ్మ అధ్యక్షతన నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ ఎల్ పూర్ణయ్య గురువారం తెలిపారు. ఎంపిటిసిలు, సర్పంచ్‌లతోపాటు మండలపరిధిలోని అందరు ప్రజాప్రతినిధులు సమావేశానికి హాజరుకావాలని కోరారు. అన్ని శాఖల అధికారులు పూర్తి సమాచారంతో ఉదయం 9 గంటలకు విధిగా హాజరు కావాలని సూచించారు.

వైసిపిపై దుష్ప్రచారం తగదు

ప్రజాశక్తి.-చింతపల్లి: పెదబరడ పంచాయతీ లోతుగడ్డ జంక్షన్‌లో బుధవారం జనసేన అరకు పార్లమెంట్ ఇన్‌ఛార్జి వంపూరు గంగులయ్య సమక్షంలో ఆ పార్టీలో చేరిన రామకృష్ణతో వైసిపికి ఎటువంటి సంబంధం లేదని పెదబరడ సర్పంచ్ సమిడి గోపాల్ ఖండించారు. రామకృష్ణ వైసిపి కార్యకర్త కూడా కాదన్నారు. రామకృష్ణతోపాటు మరో వందమంది వైసిపి నుంచి జనసేనలో చేరారంటూ తప్పుడు ప్రచారం చేయడం సరికాదన్నారు. దీన్ని పూర్తిగా ఖండిస్తున్నట్లు వెల్లడించారు.వైసిపిపై ఇలాంటి తప్పుడు ప్రచారాలకు దిగడం సిగ్గుచేటని, జనసేన నాయకులు వైసిపిపై దుష్ప్రచారాన్ని మానుకోవాలని గోపాల్ హితవు పలికారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

ప్రజాశక్తి- మాడుగుల : మండలంలో ఒంటర్లపాలెం గ్రామంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు.వచ్చే ఖరీఫ్ సీజన్‌లో ప్రకృతి సాగు వివరాలను సూచించారు. ఖరీఫ్‌కు ముందస్తుగా పచ్చిరొట్ట విత్తనాలను వేయడం ద్వారా నేలలో పోషక, జీవవైవిద్యం, నీటి నిల్వ సామర్థ్యం పెరుగుతుందని సూచించారు. పంటలలో చీడపీడలను,తెగుళ్లు తగ్గడమే కాకుండా వాతావరణ వైపరీత్యాలను తట్టుకునే సామర్థ్యం నేలకు పెరుగుతుందని అవగాహన కల్పించారు. ప్రకృతి వ్యవసాయ సాగుపై అవగాహన కల్పించేందుకు గ్రామంలో ర్యాలీ నిర్వహించారు.ఉత్తమ రైతులకు సన్మానం చేశారు.

సమన్వయంతో టోకూరు అభివృద్ధి



మాట్లాడుతున్న జెడ్‌పిటిసి గంగరాజు

ప్రజాశక్తి -అనంతగిరి : మండలంలోని టోకూరు పంచాయతీ అభివృద్ధి పనులలో ముందడుగు వేస్తుందని స్థానిక జెడ్‌పిటిసి సభ్యులు దీసరి గంగరాజు అన్నారు గురువారం టోకూరు గ్రామ పంచాయతీ సచివాలయంలో సర్పంచ్ కిల్లో మొస్య అధ్యక్షతన సాధారణ సమావేశంలో గంగరాజు మాట్లాడుతూ మండలంలో ఎక్కడా లేని విధంగా టోకూరు పంచాయతీలో వార్డు సభ్యులు, సిబ్బంది పరస్పర సహాయ సహకారాలతో సమిష్టిగా పని చెయడం వలనే అభివృద్ధి సాధ్యమౌతోందన్నారు. జిల్లా పరిషత్ నిధులతో ములియగుడ అంగన్వాడీ భవనానికి రూ.5 లక్షలు కేటాయించానని, అలాగే బగ్మరవలస, టోకూరు డ్రైనేజీలు, జాకరవలస సిసిరోడ్డు, పూలగుడ గ్రామంలో పంటకాలువ పనులు చేపట్టామన్నారు.
సర్పంచ్ కిల్లో మొస్య మాట్లాడుతూ జల్ జీవన్ మిషన్ ద్వారా కంబవలస, బోడగుడ, ములియగుడ గ్రామాలలో తాగునీటి పనులు ఇప్పటికే జరుగుతున్నాయని, మలివిడతగా సిసాగుడ, బలియగుడ జాకరవలస, తెంతెలిగుడ గ్రామాలకు ప్రతిపాదనలు పంపామన్నారు. మంజూరైన వెంటనే పనులు జరుగుతాయన్నారు. కార్యక్రమంలో ఎంపిటిసి సారా. రత్నకుమారి పంచాయతీ కార్యదర్శి ప్రసన్న శైలజ, ఉప సర్పంచ్ గెమ్మెల నర్సన్న, మాజీ సర్పంచ్ సారా దొన్ను, వార్డు సభ్యులు పి లక్ష్మణరావు, రామ్మూర్తి, ప్రసాద్, పద్మ, చంద్రన్న పాల్గొన్నారు.

ప్రారంభానికి ఎదురుచూపులు



కోరుకొండ సచివాలయ భవనం

సిద్ధమైన కోరుకొండ సచివాలయ భవనం

ప్రజాశక్తి-చింతపల్లి: మండలంలోని మారుమూల బలపం పంచాయతీ పరిధిలోని కోరుకొండలో సచివాలయ భవనం నిర్మాణం పూర్తిచేసుకుని ప్రారంభానికి సిద్ధమైంది. కొత్తగా నిర్మించిన ఈ సచివాలయం భవనం వినియోగంలోకి వస్తే, గ్రామ ప్రజలకు అధికార సేవలు మరింత అందుబాటులోకి వచ్చే అవకాశం ఉందని స్థానికులు అభిప్రాయపడ్డారు. పంచాయతీ రికార్డుల భద్రతను మెరుగుపడుతుందన్నారు.. ఇప్పటికే నిర్మాణం పూర్తయిన సచివాలయ భవనాన్ని త్వరితగతిన ప్రారంభించి వినియోగంలోకి తీసుకోవాలని కోరుకొండ గ్రామస్తులు కోరుతున్నారు.

ఎపిడబ్ల్యూజెఎఫ్ మండల కమిటీ ఎన్నిక

అధ్యక్ష, కార్యదర్శులుగా మల్లేశ్వరరావు,అర్జున్

ప్రజాశక్తి-దుంబ్రిగుడ: ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ స్థానిక మండల నూతన కమిటీ ఎన్నిక గురువారం జరిగింది. మండల గౌరవ అధ్యక్షుడుగా ఎస్ సంజీవరావు, అధ్యక్షుడిగా శెట్టి మల్లేశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా మండ్యాగురు అర్జున్, ఉపాధ్యక్షులుగా జె సింహాచలం, సహాయ కార్యదర్శిగా మండ్య గురు నవసూర్య, కోశాధికారిగా మజ్జి చక్రధర్, సహాయ కోశాధికారిగా మండ్యాగురు జగదీష్, కమిటీ సభ్యులుగా గెన్ను, స్వామి, రాంప్రసాద్, అప్పలరాజు, కృష్ణ, సాంబ, భాస్కర్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం ఎపిడబ్ల్యుజెఎఫ్ సభ్యత్వం అందజేశారు. కార్యక్రమంలో అరకులోయ మండల అధ్యక్ష కార్యదర్శులు త్రినాథ్, డేవిడ్, అరకులోయ మండల కమిటీ సభ్యులు పాల్గొన్నారు



సభ్యత్వం తీసుకుంటున్న ఎపిడబ్ల్యుజెఎఫ్ సభ్యులు

పాడైన ట్రాన్స్‌ఫార్మర్‌ను పట్టించుకోరా?

ప్రజాశక్తి -రావికమతం : మండలంలోని పులకంఠం పొన్నవోలు పంచాయతీ శివారు గడబపాలెం గ్రామంలో 20 రోజులుగా విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో గిరిజనులు నానా అవస్థలు పడుతున్నారు. గ్రామంలో ఉన్న చిన్నపాటి విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ మరమ్మతలకు గురైన విషయాన్ని విద్యుత్ శాఖ అధికారులకు తెలియజేసినప్పటికీ, సమస్య పరిష్కరించడంలో కాలం వెల్ల తీస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై జిల్లా కలెక్టరుకు ఫిర్యాదు చేస్తామని గ్రామ గిరిజనులు ఇంగిలపు దేముడు, నల్లి కాశీ మజ్జి దేముడు, గోరా శ్రీను, నల్లి కల్యాణం, దేముడు తెలిపారు.

17న పాడేరులో తిరంగా ర్యాలీ

ప్రజాశక్తి-పాడేరు టౌన్: ఆపరేషన్ సిందూర్ విజయవంతం కావడంతో అల్లూరి జిల్లా కేంద్రం పాడేరులో ఈ నెల 17న తిరంగా ర్యాలీ నిర్వహిస్తున్నట్లు మాజీ ఎమ్మెల్యే, టిడిపి నియోజకవర్గ ఇంచార్జీ గిడ్డి ఈశ్వరి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆపరేషన్ సింధూర్‌పై ప్రజల్లోకి తీసుకెళ్లే కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు.. 'మన మహిళల సిందూరాన్ని చెరిపిన ఉగ్రవాదులను మన సైన్యం కోలుకోలేని దెబ్బ కొట్టిందని, విజయోత్సవాన్ని తిరంగార్యాలీతో జరుపుకునే ఉద్దేశ్యంలో చేపట్టే కార్యక్రమంలోపాడేరు నియోజకవర్గ ఐదు మండలాల టిడిపి, బిజెపి, జనసేన, కూటమి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు హాజరై తిరంగా ర్యాలీ విజయవంతం చేయాలని గిడ్డి ఈశ్వరి కోరారు. కూటమి పాలనలో రాష్ట్ర ప్రభుత్వం స్వర్ణాంధ్రప్రదేశ్ దిశగా పయనిస్తోందన్నారు.

మోదమ్మ జాతర ఏర్పాట్లపై సమీక్ష

ప్రజాశక్తి- మాడుగుల : అందరి సహకారంతో వచ్చేనెల 3న నిర్వహించే మాడుగుల మోదకొండమ్మ జాతరను విజయవంతం చేయాలని, ఏర్పాట్లులో ఎటువంటి లోపం లేకుండా సమన్వయంతో పనిచేయాలని స్థానిక ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి అన్నారు.గురువారం స్థానిక పంచాయతీరాజ్ అతిథి గృహంలో మోద కొండమ్మ జాతర ఏర్పాట్లుపై సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ ఏడాది జూన్ 3, మంగళవారం మాడుగుల మోదకొండమ్మ జాతర జరిపేందుకు కమిటీ సభ్యులు తీర్మానం చేశారన్నారు. జాతరకు ఉత్తరాంధ్ర జిల్లాల నుండే కాకుండా రాష్ట్ర నలుమూలల నుండి అత్యధిక సంఖ్యలో భక్తులు ప్రజలు తరలి వస్తారని ఎక్కడ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు, ఇబ్బందులు తలెత్తకుండా జాతరకు వచ్చే వారికి అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేయాలని కోరారు. ముఖ్యంగా పారిశుధ్య సమస్య తలెత్తకుండా పంచాయతీ సిబ్బంది చర్యలు చేపట్టాలన్నారు తాగునీటికి ఇబ్బందులు రాకుండా ఆర్‌డబ్ల్యుఎస్ యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలన్నారు. అవసరమైనచోట్ల మెడికల్ క్యాంపులను నిర్వహించేందుకు వైద్యసిబ్బంది చర్యలు చేపట్టాలనానరు. జాతరలో విద్యుత్ సరఫరాకు ఎలాంటి అంతరాయం లేకుండా చూడాలని ఆ శాఖ అధికారులను ఆదేశించారు. అగ్నిమాపక వాహనాన్ని సిద్ధంగా ఉంచాలని,. ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా పార్కింగ్ ఏర్పాట్లు చేయాలని సూచించారు. మాడుగుల మోదమ్మ జాతర నేపథ్యంలో వచ్చేనెల ఒకటి నుంచి 5వ రకు మాడుగులకు ప్రత్యేక బస్ సర్వీసులు నడపాలని ఆర్‌టిసి అధికారులకు సూచించారు. సమీక్షకు ఆర్టీసీ అధికారులకు సమాచా జాతర సందర్భంగా వడ్డాది నుండి ఘాట్‌రోడ్ జంక్షన్ వరకు రోడ్డు పనులు జరుగుతున్న కారణంగా ఎక్కడ ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని పోలీసులను ఆదేశించారు. అన్ని శాఖల అధికారులు ఆలయ కమిటీ సభ్యులతో కలిసి మోనటరింగ్ చేసుకుంటూ పనిచేయాలని ఎంపిడిఒ,,తహసిల్దార్ మిగిలిన శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలనిసూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎడ్ల కళావతి, ఆలయ కమిటీ చైర్మన్ పుప్పాల అప్పలరాజు,ఎంపీపీ రాజారాం, టిడిపి మండల అధ్యక్షులు అద్దేపల్లి జగ్గారావు ఎంపీడీవో కొంకి అప్పారావు, తహసిల్దార్ కె రమాదేవి నాయకులు ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పిడుగుపాటుకు 30 మూగజీవాలు మృత్యువాత

ప్రజాశక్తి-రావికమతం:మండలంలో గురువారం మధ్యాహ్నం ఈదురు గాలులతో కూడిన వర్షంతోపాటు పిడుగులు పడడంతో 30 మూగజీవాలు మృతి చెందాయి. మండల కేంద్రంలోని శెట్టి వారి కల్లాల వద్ద ు మరుపాక, అగ్రహారం గ్రామాలకు చెందిన యాదవులు గొర్రెలను, మేకలను, మేతకు తీసుకురాగా, అక్కడ పిడుగు పడడంతో 30జీవాలు అక్కడకక్కడే మృతి చెందాయి. మరుపాక గ్రామానికి చెందిన సీర సాంబడు, నమ్మి వెంకటస్వామి, సిరా రమణ, దేవర అప్పలనాయుడు, అలాగే కే బి పీ అగ్రహారం గ్రామానికి చెందిన దేవర అప్పారావులకు చెందిన సుమారు 30 మేకల, గొర్రెలు అక్కడికక్కడే మృతి చెందడంతో వాటి పెంపకమే జీవనాధారంగా ఉన్న ఆయా కుటుంబాలు తీవ్రంగా నష్టపోయామని బాధితులు లబోదిబో మంటున్నారు .సుమారు 3 లక్షలకు పైగా ఆస్తి నష్టం వాటిలినట్లు అంచనా వేస్తున్నారు. ప్రభుత్వం తక్షణ సహాయం అందించాలని బాధిత రైతులు కోరుతున్నారు. కాగా పిడుగుపాటు స్థలానికి చోడవరం ఎమ్మెల్యే కెఎస్ఎన్ఎస్ రాజు చేరుకుని బాధితులను పరామర్శించారు. ప్రభుత్వపరంగా ఆదుకుంటామని భరోసానిచ్చారు.

విద్యార్థులకు ఎంసెట్ హాల్ టిక్కెట్ల పంపిణీ

ప్రజాశక్తి- నర్సీపట్నం టౌన్ : ఎస్ఎఎన్ ఎడ్యుకేషనల్ సొసైటీ, ఛారిటీ ఆధ్వర్యంలో ఎస్.కృష్ణ సహకారంతో ఎంసెట్ ఉచిత కోచింగ్ తీసుకున్న విద్యార్థులకు గురువారం హాల్‌టిక్కెట్లను అందజేశారు. నర్సీపట్నం, పరిసర గ్రామాలు, ఏజెన్సీ గ్రామీణ పేద విద్యార్థులకు ఐదేళ్లుగా ఉచిత ఎంసెట్ కోచింగ్ ఇస్తున్న ఎస్ఎఎస్ సొసైటీ ఈ ఏడాది 300 మందికి రెండు నెలల కోచింగ్ ఇచ్చింది.

శిథిలావస్థలో తహాశీల్దార్ కార్యాలయం



తహాశీల్దార్ కార్యాలయ భవనం

ప్రజాశక్తి-అడ్డతీగల: స్థానిక మండల కేంద్రంలో నిత్యం 22 పంచాయతీల నుండి తహాశీల్దార్ కార్యాలయానికి ప్రజలు వస్తుంటారు. అయితే కార్యాలయం శిథిలావస్థకు చేరుకోవడంతో ఉద్యోగులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని విధులు నిర్వహిస్తున్నారు. 1999లో మావోయిస్టులు బాంబు బ్లాస్టింగ్‌తో కార్యాలయం రెండు భాగాలు పూర్తిగా పడిపోయినా నేటికీ అదే కార్యాలయంలో విధులు నిర్వహించడం ఉద్యోగుల పాలిట శాపంగా మారింది. గతంలో టిడిపి ప్రభుత్వం నూతన తహాశీల్దార్ కార్యాలయాన్ని నిర్మించాలని ఎంతో అట్టహాసంగా సుమారు కోటి 20 లక్షల నిధులు మంజూరు చేశారు. అయితే భవనం పనులు 50 శాతం పూర్తయ్యాయి. కాంట్రాక్టర్‌కు బిల్లులు చెల్లించకపోవడంతో కొత్త కార్యాలయం పనులు నిలిచిపోయాయి. మండల కేంద్రంలో ఎక్కడైనా వేరే కార్యాలయం ఖాళీ ఉంటే అక్కడికి తహాశీల్దార్ కార్యాలయాన్ని మార్చాలని ప్రయత్నిస్తున్నా వారికి చుక్కెదురైంది. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

రహదారి పనుల్లో నాణ్యత పాటించాలి




రహదారిని పరిశీలిస్తున్న ఇఇ శ్రీనివాస్

ప్రజాశక్తి-రాజవొమ్మంగి: గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న రహదారి నిర్మాణ పనుల్లో గుత్తేదారులు నాణ్యతా ప్రమాణాలు పాటించాలని గిరిజన సంక్షేమ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీనివాస్ అన్నారు. మండలంలో అప్పలరాజుపేట, ముంజవర పాడు, జడ్డంగి, చిన్నయ్యపాలెం, వయ్యాడులో జరుగుతున్న బిటి రహదారి పనులు పురోగతిని, ఇతర నిర్మాణ పనులను ఇఇ శ్రీనివాస్ గురువారం పర్యవేక్షించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. రహదారి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. డిఈ గౌతమి, సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు పురస్కారం

ప్రజాశక్తి-రాజవొమ్మంగి: పదోతరగతి పరీక్షా ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బిసి సంక్షేమశాఖ మంత్రి ఎస్.సవిత పురస్కారాలను అందజేశారు. రాజవొమ్మంగి బిసి బాలుర, బాలికల వసతిగృహ విద్యార్థులు మాకిరెడ్డి జగత్, నల్లమ శ్రీదుర్గలకు రాష్ట్ర బిసి సంక్షేమశాఖ మంత్రి ఎస్.సవిత ఉత్తమప్రతిభ పురస్కారాలు అందచేశారు. అల్లూరి జిల్లా రాజవొమ్మంగి బిసి బాలుర, బాలికల వసతిగృహాల విద్యార్థులు ఈ సంవత్సరం పదోతరగతి ఫలితాల్లో అత్యధిక మార్కులు సాధించారు. ఈ సందర్భంగా వసతిగృహ సంక్షేమ అధికారులు టి.శంకర్, పి.దుర్గాభవానిలను మంత్రి అభినందించారు.



విద్యార్థులకు ప్రతిభా పురస్కారాన్ని అందిస్తున్న మంత్రి

కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ సమస్యలపై స్పందించాలి



నిరసన తెలుపుతున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్:
న్యాయమైన డిమాండ్ల సాధన కోసం 18 రోజులుగా కమ్యూనిటి హెల్త్ ఆఫీసర్స్ సమ్మె చేస్తూ, అన్ని జిల్లాల్లో నిరసన కార్యక్రమాలను నిర్వహిస్తుంటే ప్రభుత్వం కనీసం స్పందించక పోవడం బాధాకరంగా ఉందని, ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించాలని కమ్యూనిటి హెల్త్‌ఆఫీసర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షురాలు ప్రజ్న కోరారు. వైద్యఆరోగ్య శాఖలో ఎన్‌హెచ్‌ఎం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో ఆయుష్మాన్‌లో పనిచేస్తున్న కమ్యూనిటి హెల్త్ ఆఫీసర్లను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన నిరవధిక సమ్మెలో భాగంగా గురువారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ ఆయుష్మాన్‌భారత్ నిబంధనల ప్రకారం 6 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సిహెచ్‌ఒలను రెగ్యులర్ చేసి ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులతో సమానంగా 23 శాతం వేతనం పెంచి చెల్లించాలన్నారు. పని ఆధారిత ప్రోత్సాహకాలను క్రమబద్ధీకరించి, ఇపిఎఫ్ పునరుద్ధరించాలన్నారు. పిఎఫ్ మినహాయింపు రెండు సంవత్సరాలుగా నిలిపివేశారని, ఇది సరికాదని, పాతపద్ధతిలో పిఎఫ్ మినహాయింపు ఉండాలని డిమాండ్ చేశారు. క్లినిక్ అద్దె బకాయిలను వెంటనే చెల్లించి క్రమబద్ధీకరించి నిర్దిష్టమైన జాబ్‌చార్ట్ అందించాలన్నారు. ఎఫ్‌ఆర్ఎస్ నుండి సిహెచ్‌ఒలను మినహాయింపు ఇవ్వాలన్నారు. హెచ్‌ఐర్‌పాలసీ, ఇంక్రిమెంట్, ట్రాన్స్ఫర్, ఎక్స్ గ్రేషియో, పితత్వసెలవులు అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో స్వాతి, దివ్య అరుణ తదితరులు పాల్గొన్నారు.

టిడ్కో ఇళ్లను వెంటనే పూర్తి చేయాలి

తెలుగు శక్తి అధ్యక్షుడు బి.వి రామ్

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్:
రాష్ట్రప్రభుత్వం యుద్ధప్రాతిపదికన టిడ్కో ఇళ్ల పూర్తి చేసి లబ్ధిదారులకు అందజేయాలని తెలుగుశక్తి అధ్యక్షుడు బి.వి.రామ్ డిమాండ్ చేశారు. లబ్ధిదారులు బ్యాంకు రుణాలకు చెందిన ఇఎంఐ కూడా ప్రభుత్వం చెల్లిస్తుందని అసెంబ్లీ సాక్షిగా బిజెపి ఫ్లోర్ లీడర్ పి.విష్ణుకుమార్‌రాజు అడిగిన ప్రశ్నకు ప్రభుత్వం స్పందించిందన్నారు. గురువారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలియజేసి అనంతరం మీడియాతో మాట్లాడారు. 2 లక్షల 68 వేల మంది లబ్ధిదారులు ఉన్నారని, వీరు లక్ష రూపాయల చొప్పున 2017లో టిడ్కో ఇంటి కోసం చెల్లించారని, మిగిలిన దానికి బ్యాంకు రుణం ఇచ్చారని తెలిపారు. ప్రస్తుతం ఇఎంఐతో పాటు వడ్డీతో కలిపి రూ.5వేలు లబ్ధిదారులు చెల్లిస్తున్నారన్నారు. దీనివల్ల 10,72,000 మంది ఇబ్బంది పడుతున్నారన్నారు. ఈ విషయమే అసెంబ్లీలో ప్రస్తావనకు రాగా, ఈఎంఐ ప్రభుత్వమే చెల్లించే విధంగా సంబంధిత శాఖామంత్రి హామీ ఇచ్చారని తెలిపారు. నిధులన్నీ అమరావతికి మళ్లిస్తున్నారని, ముందుగా టిడ్కో ఇళ్ళు పూర్తి చేసి లబ్ధిదారులకు అందజేయాలని డిమాండ్ చేశారు. లబ్ధిదారులందరికీ టిడ్కో ఇళు ఇచ్చేవరకు తాను పోరాటం కొనసాగిస్తానని హెచ్చరించారు. ఎమ్మెల్యే పల్లా శ్రీనివాస్ భూదందాలపై ఏప్రిల్ 24న ఢిల్లీలో సిబిఐ, కేంద్ర హోంమంత్రికి నివేదిక ఇచ్చానని దీనిపై ఆగ్రహించి, పల్లా శ్రీనివాస్ తనను హతమార్చడానికి ప్రయత్నం చేస్తున్నారన్నారు. దాడికి సంబంధించిన వీడియోలు విడుదల చేయాలని, పల్లాపై హత్యాయత్నం కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. తాను వ్యక్తిగతంగా పల్లాపై పోరాటం చేస్తున్నానని, ఇది టిడిపిపై పోరాటం కాదన్నారు.

ఆరోహణ సోషల్ ఇన్నోవేషన్ అవార్డుల ప్రకటన

ప్రజాశక్తి-ఎంవిపి కాలని:
భారతదేశంలో సామాజిక ఆవిష్కర్తలకు మద్దతుగా సాధికారత కల్పించడానికి ఇన్ఫోసిస్ తన సిఎస్ఆర్ విభాగమైన ఇన్ఫోసిస్ ఫౌండేషన్ ద్వారా ఆరోహణ సోషల్ ఇన్నోవేషన్ అవార్డుల నాలుగో ఎడిషన్ ప్రారంభిస్తున్నట్టు గురువారం విశాఖలో ప్రకటించింది. ఈ మేరకు నోవాటెల్ హోటల్‌లో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో ఇన్ఫోసిస్ ఫౌండేషన్ ట్రస్టీ సుమిత్ విర్మాణి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో రూ.2 కోట్లను బహుమతిగా అందజేస్తామని ఇన్ఫోసిస్ ఫౌండేషన్ సామాజిక వ్యవస్థాపకులను ఈ అవార్డులలో పాల్గొనమని ఆహ్వానిస్తోందన్నారు. దేశవ్యాప్తంగా సాంకేతిక ఆధారిత పరిష్కారాలను అభివృద్ధి చేసే వ్యక్తులు, బృందాలు, ఎన్‌జిఒలు, సామాజిక సంస్థలను గుర్తించి బహుమతులు ఇవ్వడం లక్ష్యంగా పెట్టుకుందన్నారు. ప్రతి విజేతకు రూ.50 లక్షల బహుమతి ఇస్తామని మొత్తం నాలుగు అవార్డులను అందజేస్తామని తెలిపారు. ఈ అవార్డులకు దరఖాస్తుల స్వీకరణ జూన్ 15తో ముగుస్తుందని 18 సంవత్సరాలు అంతకంటే ఎక్కువ వయసు ఉన్న భారతీయులందరూ ఎంట్రీలు ఇవ్వవచ్చని ఆయన తెలిపారు.

జులై 5న జాతీయ లోక్ అదాలత్

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఉమ్మడి విశాఖపట్నం జిల్లా పరిధిలోని అన్ని న్యాయ స్థానాల్లో జులై 5న జాతీయ లోక్ అదాలత్ జరుగుతుందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి చిన్నంశెట్టి రాజు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. న్యాయ స్థానాల్లో ఉన్న పెండింగ్ కేసులు, సివిల్, చెక్ బౌన్స్, బ్యాంకింగ్, మోటార్ ప్రమాదాల నష్ట పరిహారాల కేసులు, సెక్షన్ 138 నెగోషియబుల్ ఇన్స్ట్రుమెంట్స్ చట్టం కేసులు, బ్యాంకు, మనీ రికవరీ కేసులు, ల్యాండ్ అక్విజిషన్ కేసులు, కార్మిక, కుటుంబ తగాదాలు (విడాకులు కేసులు కాకుండా), పారిశ్రామిక వివాదాలు, రాజీ పడదగ్గ క్రిమినల్ కేసులను ఈ లోక్ అదాలత్‌లో పరిష్కరించుకోవచ్చని పేర్కొన్నారు.

ఘనంగా గంగాలమ్మ పండగ



ఘటాలు తీసుకెళ్తున్న భక్తుడు

ప్రజాశక్తి-రాజవొమ్మంగి: మండలంలో బడదనాంపల్లి, గింజర్తి గ్రామాల్లో ఆయా గ్రామపెద్దల ఆధ్వర్యంలో గంగాలమ్మ పండుగ గురువారం ఘనంగా నిర్వహించారు. పసుపు,కుంకుమలతో గిరిజనులు ప్రత్యేకపూజలు చేశారు. ఈ పండుగ చేయడం వల్ల వర్షాలు సకాలంలో కురిసి పంటలు బాగా పండుతాయని ఇక్కడ గిరిజనుల ప్రగాఢ నమ్మకం. తరాల నుండి పండుగను జరుపుకోవడం ఆనవాయితీగా వస్తుందని గ్రామస్తులు తెలిపారు.

జర్నలిజంలో రేగాన షణ్ముఖకు డాక్టరేట్



అవార్డు అందుకుంటున్న షణ్ముఖ

ప్రజాశక్తి-ఎంవిపి కాలనీ:
ఆంధ్ర విశ్వవిద్యాలయం జర్నలిజం విభాగ పరిశోధక విద్యార్థి రేగాన షణ్ముఖకు డాక్టరేట్ లభించింది. ప్రస్తుతం ఆంధ్రకేశరి విశ్వవిద్యాలయం ఇన్‌చార్జి ఉపకులపతి ఆచార్య డి.వి.ఆర్.మూర్తి పర్యవేక్షణలో 'డిఫ్యూజన్ ఆఫ్ ఇన్నోవేషన్ అమోంగ్ షెడ్యూల్ క్యాస్ట్ పాపులేషన్- ఏ స్టడీ ఆఫ్ మోసూరు విలేజ్ ఇన్ ఆంధ్రప్రదేశ్' అనే అంశంపై జరిగిన పరిశోధనకు డాక్టరేట్ లభించింది. ఆంధ్ర విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య జి.పి.రాజశేఖర్ నుంచి డాక్టరేట్ ఉత్తర్వులను షణ్ముఖరావు గురువారం అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయనను విభాగాచార్యులు, పరిశోధకులు అభినందించారు. ప్రస్తుతం షణ్ముఖరావు అనకాపల్లి జిల్లా కలెక్టర్ కార్యాలయం సమాచార పౌర సంబంధాల శాఖలో పబ్లిక్ రిలేషన్స్ అధికారిగా సేవలందిస్తున్నారు.

22 నుంచి మాస్టర్ ప్లాన్‌పై సలహాల స్వీకరణ

ప్రజాశక్తి-ఎంవిపి.కాలనీ :
2021 నవంబర్ 8న ఆమోదించబడిన విఎంఆర్డిఎ మాస్టర్ ప్లాన్ 2041ను పున:పరిశీలించుటకు ప్రభుత్వం ఆదేశించిన క్రమంలో విఎంఆర్డిఎ పరిధిలోని ప్రజలు, భాగస్వామ్యులు, సంబంధిత శాఖల నుంచి అభ్యంతరాలు, సలహాలను స్వీకరించడం కోసం ఈనెల 19వ తేదీన ప్రకటన జారీ చేస్తామని మెట్రోపాలిటన్ కమిషనర్ కే.ఎస్ విశ్వనాథన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. విఎంఆర్డిఎ పరిధిలో ఉన్న ప్రజలు, సంబంధిత ప్రభుత్వ శాఖలు, మాస్టర్‌ప్లాన్ 2041ను పరిశీలించి అభ్యంతరాలు, సలహాలను 2025 మే 22 నుంచి 2025 జూన్ 21 లోపు స్వయంగా లేదా తపాల ద్వారా లేదా విఎంఆర్డిఎ ప్రత్యేకంగా తయారు చేసిన వెబ్ అప్లికేషన్ ద్వారా సమర్పించాలని ఆయన సూచించారు. విఎంఆర్డిఎ వెబ్ అప్లికేషన్ మొబైల్‌ఫోన్ ద్వారా కూడా ఉపయోగించవచ్చునని కావున ఈ అవకాశాన్ని ప్రజలు ,ప్రభుత్వశాఖలు, సంబంధిత వ్యక్తులు వినియోగించుకోవాలన్నారు.

నియోజకవర్గ పున:రూపకల్పన కోసం సమావేశం

ప్రజాశక్తి-ఎంవిపి.కాలనీ:
మహా విశాఖపట్నం నగరపాలక సంస్థలో ఉన్న ఎనిమిది జోన్ల పరిధిలో పశ్చిమ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో పున:రూపకల్పన చేసేందుకు ప్రతిపాదనలు తయారు చేయుటకు 16వ తేదీన సమావేశం నిర్వహించనున్నట్టు ఐదోజోన్ జోనల్ కమిషనర్ బి.రాము గురువారం పత్రికా ప్రకటనలో తెలిపారు. విశాఖపట్నం పశ్చిమ నియోజకవర్గం పరిధి పున:రూపకల్పనకై జ్ఞానపురం జోన్-5 కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఉదయం 11 గంటలకు ప్రజాప్రతినిధులు, నివాసిత సంక్షేమ సంఘాల ప్రతినిధులు, వివిధరంగాల్లో అనుభవజ్ఞులైన పౌరుల సూచనలు, సలహాలను స్వీకరించుటకై సమావేశం నిర్వహిస్తున్నట్టు ఆయన తెలిపారు.

కాపులకు అండగా కూటమి ప్రభుత్వం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ:
రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కాపులకు ఎల్లవేళలా అండగా ఉంటుందని విఎంఆర్డిఎ చైర్మన్ ఎం.వి.ప్రణవ్‌గోపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలో కాపు సామాజికవర్గం కోసం కాపు భవనం నిర్మాణానికి అవసరమైన నిధుల మంజూరు కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్తామని తెలిపారు. గతంలో టిడిపి హయంలో కాపు భవనం కోసం ఎకరా భూమి కేటాయిస్తే, వైఎస్ఆర్‌సిపి హయాంలో అది 50 సెంట్లకు కుదించారని పేర్కొన్నారు. భవన నిర్మాణానికి ఎలాంటి నిధులు విడుదల చేయకుండా ఎన్నికల సమయంలో వైఎస్ఆర్‌సిపి నేతలు హడావుడిగా భూమిపూజ చేసి వదిలేశారని విమర్శించారు. కూటమి ప్రభుత్వం హయంలోనే కాపు భవనం నిర్మాణం తథ్యమని పేర్కొన్నారు.